ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.19.12.2024 సమయం : 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. వికారాబాద్ జిల్లా కొడంగల్ లోని నూతన వైద్య కళాశాలలో వచ్చే ఏడాది అడ్మిషన్లు ప్రారంభిస్తామని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శాసనమండలిలో వెల్లడించారు.
2. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని BRS కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
3. తన పార్లమెంట్ నియోజకవర్గంలో గ్రామాలకు రవాణా సదుపాయాలను మెరుగుపర్చేందుకు 224 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని కేంద్రమంత్రి బండి సంజయ్ కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు.
4. తెలంగాణ జానపద కళాకారుడు పస్తం మొగిలయ్య ఈ ఉదయం మృతి చెందారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

------------------------------------

**కొడంగల్ మెడికల్ కాలేజీ**

వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఏర్పాటు చేస్తున్న వైద్య కళాశాలలో వచ్చే ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తామని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఈరోజు శాసనమండలిలో వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ తెలిపారు. ఈ వైద్య కళాశాలకు అనుబంధంగా నర్సింగ్, పారామెడికల్ కళాశాలలు కూడా ప్రారంభిస్తున్నామని తెలియజేశారు. ఈ ఏడాది రాష్ట్రంలో 8 కొత్త వైద్య కళాశాలలను ప్రారంభించామని మంత్రి గుర్తు చేశారు. ఒక్కో కళాశాలలో 50 సీట్లు అందుబాటులోకి వచ్చాయని, అన్ని కాలేజీల్లో NMC నిబంధనలకు అనుగుణంగా బోధనా సిబ్బందిని నియమించామని తెలిపారు. రాష్ట్రంలో అన్ని ఆసుపత్రుల్లో కలిపి 2500లకు పైగా వ్యాధి నిర్ధారణ యంత్రాలు ఉన్నాయని మంత్రి వెల్లడించారు. ఈ యంత్రాల నిర్వహణ, మరమ్మత్తులకు ప్రత్యేక సెల్స్ ఏర్పాటు చేశామన్నారు. అవసరాన్ని బట్టి అవసరమైన చోట MRI స్కానింగ్ సర్వీసులు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం మొబైల్ స్క్రీనింగ్ సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని, ప్రాంతీయ క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నామని ఆయన వెల్లడించారు. ప్రతి జిల్లాలోనూ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు.

**SANGAREDDY. PTC, PN11.20**

------------------------

**కేటీఆర్**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని BRS కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్

చేశారు. సభలో ప్రవేశపెట్టనున్న పురపాలక, GHMC, పంచాయతీరాజ్ చట్టాల సవరణ బిల్లులో బీసీల రిజర్వేషన్ల అంశం లేదన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ఈ బిల్లులకు తమ పార్టీ తరఫున సవరణలు ప్రతిపాదిస్తామని, వాటిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సవరణలకు ప్రభుత్వం అంగీకరించకుంటే ఈ అంశంపై అవసరమైతే సభలో డివిజన్ కు పట్టుబడతామని అన్నారు. నవంబర్‌లోగా జనగణన పూర్తి చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, దానిని ఎటూ తేల్చకుండానే చట్ట సవరణకు అసెంబ్లీలో ప్రయత్నం చేయడం పై అభ్యంతరం తెలిపారు.

**డెస్క్ 11.56**

---------------------------

**బండి సంజయ్**

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని గ్రామాలకు రవాణా సదుపాయాలను మెరుగుపర్చేందుకు 224 కోట్ల రూపాయల CRIF నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఈ మేరకు ఢిల్లీలో నిన్న సాయంత్రం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సంజయ్ వినతి పత్రం అందజేశారు. కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, వంతెనల అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలను గడ్కరీ దృష్టికి తీసుకువచ్చారు.

**PTC, కరీంనగర్, 11.17**

-------------------------

**బీజేపీ ఎమ్మెల్యేలు**

రైతు సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శాసన సభ్యులు ఈ రోజు ఎద్దుల బండిపై అసెంబ్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ రైతు సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వానికి సమయం దొరకడం లేదా అని ప్రశ్నించారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలని, రైతు భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసేందుకే ఎద్దులబండిపై అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యామని తెలిపారు.

**డెస్క్, 11.45**

-------------------------

**లగచర్ల**

సంగారెడ్డి జిల్లా కేంద్ర కారాగారాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ నిన్న తనిఖీ చేశారు. వికారాబాద్ లగచర్ల కేసులో నిందితుడిగా ఉన్న రైతు అస్వస్థతకు గురి కాగా, బేడీలు వేసి ఆసుపత్రికి తరలించడం వివాదాస్పదమైన నేపథ్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. సంగారెడ్డి సెంట్రల్ జైలులోని బ్యారక్‌లు,

గదులు, వంట గది, జైలు ఆవరణను పరిశీలించారు. జైలులో ఉన్న సదుపాయాలు, భోజన నాణ్యత గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**SANGAREDDY PTC 11.25**

---------------------------

**ఉత్తమ్ కుమార్**

శాసన సభలో ఈ రోజు భాగంగా, నీటిపారుదల ప్రాజెక్టులు, కాలువలు పై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు నీటిపారుదల శాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సమాధానం ఇచ్చారు. బునాదిగాని కాలువ, పిల్లాయిపల్లి ధర్మారెడ్డి కాలువల ద్వారా... 60వేల ఎకరాలకు నీరందిస్తామని, ఎమ్మెల్యేలు భూసేకరణలో చొరవ తీసుకుంటే ఆ మూడు మూసీ కాలువలను ఏడాది వ్యవధిలోనే పూర్తి చేయిస్తామన్నారు. ఇప్పటికే వాటి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేశామని తెలిపారు. మూసీ పునరుజ్జీవంతో గోదావరి నీళ్లు మూసీకి వస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆయకట్టుకు నీటి వసతి పెరుగుతుందన్నారు. అన్ని ప్రాజెక్టులు పద్ధతి ప్రకారం పూర్తి చేస్తున్నామన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు విషయంపై మాట్లాడుతూ దాని భూసేకరణకు 37 కోట్ల రూపాయలు విడుదల చేశామని తెలిపారు. ఈ వారంలో మరో 22 కోట్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఇక స్టేషన్ ఘన్పూర్ కాలువ పనులకు 120 కోట్ల రూపాయలు మంజూరు చేశామని, పనులకు త్వరలోనే టెండర్లు పిలుస్తామని చెప్పారు.

**(HYD -PTC)**

-------------------------------

**డిఫెన్స్ కాలేజీ**

సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ –CDM కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు ప్రతిష్టాత్మక ప్రెసిడెంట్ కలర్స్ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. 1970లో ఏర్పాటైన ఈ కళాశాల వివిధ దేశాలకు చెందిన వందలాది మంది సైనికాధికారులకు మిలిటరీ నిర్వహణ నైపుణ్యాల శిక్షణ అందించింది. కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌కు ప్రెసిడెంట్ కలర్స్ దక్కడం కళాశాలలో శిక్షణ పొందిన త్రివిధ దళాల సైనికాధికారులందరికీ గర్వకారణం అని CDM కమాండెంట్ మేజర్ జనరల్ హర్ష్ ఛిబ్బర్ చెప్పారు. వ్యూహాత్మక నాయకత్వాన్ని తీర్చిదిద్దటం, సీనియర్ సైనిక అధికారులకు ఉన్నత స్థాయి రక్షణ నిర్వహణ నైపుణ్యాలను అందించడంలో CDM వారసత్వానికి ఇది నిదర్శనమని మేజర్ జనరల్ హర్ష్ ఛిబ్బర్ తెలిపారు.

**(Soundbyte- Maj Gen Harsh Chibber)**

**MSL 11.00 A.M.**

------------------------------

**మొగిలయ్య**

తెలంగాణ జానపద కళాకారుడు పస్తం మొగిలయ్య ఈ ఉదయం చెందారు. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. బేడ,

బుడగ జంగాల జానపద కళారూపం 'శారద కథల' కు బహుళ ప్రాచుర్యం కల్పించిన మొగిలయ్య మరణం బడుగుల, సంగీత సాహిత్య రంగానికి తీరని లోటు అని ముఖ్యమంత్రి అన్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలానికి చెందిన పస్తం మొగిలయ్య లి చోట్ల శారద కథల తంబుర మీటుతూ, బుర్ర (డక్కీ) వాయిస్తూ అనేక ప్రదర్శనలు ఇచ్చారు. తెలంగాణ ఆత్మను ఒడిసిపట్టిన "బలగం" సినిమా చివర్లో వచ్చే మొగిలయ్య గారి పాట ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.

**పీఎస్**

----------------------------

**ఎస్సీ వర్గీకరణ**

ఎస్సీ వర్గీకరణ అంశంపై విచారణ చేపట్టేందుకు జిల్లా కు వచ్చిన ఏక సభ్య కమిషన్, రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ ఈ రోజు హన్మకొండ కలెక్టరేట్ సమావేశం మందిరంలో బహిరంగ విచారణ ప్రారంభించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన ప్రజలు, వివిధ వర్గాల నుంచి వినతులు, అభిప్రాయాలను జస్టిస్ షమీమ్ అక్తర్ స్వీకరిస్తున్నారు. షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో బహిరంగంగా విచారణ చేస్తున్నారు.

**వరంగల్ జిల్లా పీటీసి**

-------------------------------

**చర్లపల్లి రైల్వే టెర్మినల్**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో సుమారు 430 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ఈ నెల 28న కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ టెర్మినల్‌ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేశారు.

**పిటిసి మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా, 11.50**

------------------------------